క్లుప్తంగా

మస్తాన్‌వల్లి దర్గా ఉరుసు ప్రారంభం


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

మదనపల్లె సిటీ: స్థానిక కోటవీధిలోని సయ్యద్ ఖాజా సయ్యద్ మస్తాన్‌వల్లి దర్గా ఉరుసు ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గంధం హజరత్ గులాంఅలీషా దర్గా షరీఫ్ నుంచి వైభవంగా దర్గాకు చేరింది. దర్గాను రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలకరించారు. దర్గాలో ప్రత్యేక పూలతో మజార్లకు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, కార్యదర్శి యూసఫ్‌ఖాన్, కోశాధికారి ప్యారీజాన్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు బియ్యం వితరణ

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై మహాశివరాత్రికి వచ్చే భక్తులకు అన్నదాన ట్రస్టు ద్వారా ఉచిత అన్నదానం నిర్వహిస్తారు. మంగళవారం టీఎస్ కుటుంబీకులు ప్రముఖ పారిశ్రామికవేత్తలు టీఎస్ అరవిందరెడ్డి, టీఎస్ విజయనారాయణరెడ్డిలు 5 క్వింటాళ్ల బియ్యాన్ని వితరణగా ఇచ్చారు. టీఎస్ కంపెనీ మేనేజర్ బియ్యాన్ని అన్నదాన ట్రస్టు సభ్యులకు అప్పగించారు.

సర్వే పూర్తి చేయండి

పెద్దతిప్పసముద్రం: విధుల పట్ల అలసత్వాన్ని వీడి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చేపడుతున్న సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన సిబ్బందితో సమీక్షించి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పీఫోర్, ఎంఎస్ఎంఈ, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేతో పాటు 0–6 మధ్య వయస్సు ఉన్న పిల్లల ఆధార్ నమోదును సమగ్రంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఎంపీ కృషితో పీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు


ఇంతియాజ్ ఖాన్

కేవీపల్లె : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కృషితో కేవీపల్లె మండలం నూతనకాల్వకు చెందిన ఇంతియాజ్‌ఖాన్‌కు రూ. 3 లక్షలు ప్రధానమంత్రి సహాయ నిధి మంజూరు అయింది. రాజంపేట ఎంపీ కార్యాలయం నుంచి మంగళవారం వివరాలు వెల్లడించారు. నూతనకాల్వకు చెందిన సయ్యద్‌షా వలి కుమారుడు ఇంతియాజ్ ఏడాది బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు టి. సాహిత్‌రెడ్డి, అస్లాం ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ కృషితో ఇంతియాజ్‌ఖాన్‌కు రూ. 3 లక్షలు పీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది.

పలవలి రామకృష్ణారెడ్డికి నివాళి

మదనపల్లె : సీపీఎం సీనియర్ నేత పలవలి రామకృష్ణారెడ్డి బాటలో పయనించడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సీపీఎం సీనియర్ నేత పలవలి రామకృష్ణారెడ్డి 4వ వర్ధంతి సభ సీపీఎం కార్యాలయంలో జరిగింది. పలవలి రామకృష్ణారెడ్డి ఫోటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన రామకృష్ణారెడ్డి.. బాగా చదువుకుని న్యాయవాదిగా పేదల నుంచి పైసా ఫీజు తీసుకోకుండా సేవలందించారని కొనియాడారు. సీపీఎం నాయకులు హరిశర్మ మాట్లాడుతూ చివరివరకు పేదల అభివృద్ధి కోసం రామకృష్ణారెడ్డి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహ, రఘునాథ్, నాగరాజు, సీఐటీయూ నాయకులు నారాయణ, రమణ, కృష్ణమూర్తి, విద్యార్థి నాయకులు జయబాబు, ఆఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నివారణపై అగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై మంచి భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజంలో కీలకపాత్ర పోషించాలన్నారు. అనంతరం విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు.

‘మా గోడు పట్టించుకోండి’

పెద్దతిప్పసముద్రం: మదనపల్లి ఆర్టీసీ అధికారులూ మా గోడు ఆలకించి బస్సులు నడపాలని మండలంలోని నవాబుకోట పంచాయతీకి చెందిన ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. మంగళవారం ఆ గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రతి రోజూ బెట్టకొండ నుంచి వరికసువుపల్లి మీదుగా బి.కొత్తకోటకు నడిచే ఆర్టీసీ బస్సు గత వారం రోజుల నుంచి సక్రమంగా నడవడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

స్వయంభువుడు.. యోగ నేలమల్లేశ్వరుడు

- కోరినంతనే వరాలిచ్చే దేవుడిగా ప్రసిద్ధి
- రూ. కోటితో ఆలయ పునర్నిర్మాణం
- ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు


నిర్మాణం పూర్తి చేసుకున్న నేలమల్లేశ్వర స్వామి ఆలయ గర్భగుడి


విశేష అలంకరణలో స్వామివారు

నిమ్మనపల్లె : మహా శివరాత్రికి నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు సిద్ధమవుతున్నాయి. మండలంలోని తవళం గ్రామ పరిధి పెండ్లిగుండ్ల కనుమలో వెలసిన శ్రీయోగనేలమల్లేశ్వరుడు స్వయంభువుగా వెలిశారు. కోరినంతనే కోర్కెలు తీర్చి వరాలు ప్రసాదించే దేవుడిగా స్వామివారిపై భక్తులకు ప్రగాఢ నమ్మకం. భక్తి శ్రద్ధలతో నేలమల్లేశ్వర స్వామిని కొలిచిన వారి సకల పాపాలు తొలుగుతాయని ఇక్కడి ప్రజల విశ్వాసం. ఇక్కడ రెండు పుష్కరిణులు కలిగి ఉండడం విశేషం. ప్రతి ఏటా మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి జాగరణ, పగటి తిరునాలకు జనం వేల సంఖ్యలో పోటెత్తుతారు. ఇందులో భాగంగా బుధ గురు వారాలలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది.

స్థల పురాణం

పూర్వం ఆలయం ఉన్న ప్రాంతంలో దండుడు అనే రాక్షసుడు ఉండేవాడు. అతడు తమ గురువు అయిన శుక్ర మహాముని పుత్రిక ఆరీజను చెరపట్టడంతో శుక్రాచార్యుని శాపానికి గురవుతాడు. అందులో భాగంగా రాజ్యం దండకారణ్యంగా మారింది. ఇక్కడ మనుషులకు దుర్గుణాలు అలవడ్డాయి. పాండవులు తమ వనవాస సమయంలో ఈ ప్రాంతంలో సంచరించారని, ఆ సమయంలో ఇక్కడి ప్రజల దుర్గుణాలను తొలగించాలని శివుడిని వేడుకున్నట్లు కథనం. పాండవ అగ్రజుడైన ధర్మరాజుకు ఇచ్చిన మాటతో శివుడు ఇక్కడ వెలసినట్టు స్థల పురాణం చెబుతోంది.

రాజుల ఏలికలో

నిమ్మనపల్లె ప్రాంతం చోళరాజుల తర్వాత విజయనగర రాజుల సామంతులుగా పాలెగాళ్ల నాయునివారైన నాగప్పనాయుడు ఆధీనంలో ఉండేది. తర్వాత ఆయన కుమారుడు అహోబిళ నాయుడు, అతని కుమారుడు వెంకటచలపతి నాయుడు పరిపాలించారు. లక్ష్మీదేవి, వెంకటాచలపతి నాయుడు ఆధ్వర్యంలో ఈ ఆలయం నిర్మితమైంది. వీరి రెండో కుమారుడు కుమారస్వామినాయుడు ఏడేళ్ల వయస్సులో ఆలయం లోని శివుడిని దర్శించడంతో దివ్యజ్ఞానం కలిగి ద్వాపరయుగంలో జరిగిన ఇక్కడి వృత్తాంతాన్ని స్థానికులకు తెలిపాడు. వీరి పశువుల మంద నుంచి ఆవు ఇక్కడి దట్టమైన పొదల్లోకి వెళ్లి,పాలధారను పుట్టలోకి విడవడం పశువులకాపరి గమనించాడు. ఈ విషయాన్ని వెంకటాచలపతి నాయుడుకి తెలపగా పుట్టను తవ్వి చూడగా స్వయంభు శివలింగం బయటపడింది. ఆ తర్వాత ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్టు పెద్దలు చెబుతున్నారు.

రూ. కోటి తో ఆలయ పునర్నిర్మాణం

తవళం అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ యోగ నేల మల్లేశ్వర స్వామి ఆలయ గర్భగుడి వర్షాలకు తడుస్తుండటంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆలయ అభివృద్ధికి మూడు కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం వెంటనే కోటి రూపాయలను ఆలయ పునర్నిర్మాణ పనులకు కేటాయించింది. అందులో భాగంగా 2024 మార్చిలో ఆలయ పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం ఆలయ గర్భగుడి నిర్మాణం పూర్తి కాగా ఆలయ ప్రహరీతోపాటు మరికొన్ని నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు ఆలయం వద్ద నుంచి చౌడేపల్లి మండల కేంద్రానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తే, పెద్ద సంఖ్యలో భక్తులు రావడానికి అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఆలయం వేగంగా అభివృద్ధి చెంది, ఆదాయం పెరుగుతుందని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మహాశివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని భక్తులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తోంది. మదనపల్లె ఆర్టీసీ డిపోల నుంచి నిమ్మనపల్లె, మదనపల్లె నుంచి బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయి. 26న బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం, రాత్రి తిరుణాల, 27న గురువారం విశేష పూజలు, పగటి తిరునాల జరుగుతుంది.

అందరి సహకారంతో ఆలయాభివృద్ధి



అందరి సహకారంతో నేల మల్లేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాం. అందులో భాగంగా ఇప్పటికే గర్భగుడితో పాటు ఇతర నిర్మాణాలను కోటి తో చేపట్టడం జరిగింది. ఆలయాలన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేస్తున్నాం. - మంజుల, ఆలయ ఈఓ

పూర్వజన్మ సుకృతం



19 ఏళ్లుగా నేల మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నా. స్వామికి సేవ చేసుకోవడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా. ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి ఆలయ అభివృద్ధిలో భాగం కావడం,స్వామి సేవలో తరించడం సంతోషంగా ఉంది. -శంకరశర్మ ఆలయ పూజారి

కోర్కెలు తీర్చే సిద్దేశ్వరుడు


కలకడ సిద్దేశ్వరుడు

కలకడ : రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రాల్లో కలకడ సిద్దేశ్వరస్వామి ఆలయం ఒకటి. సిద్దేశ్వర స్వామి కోర్కెలు తీర్చేదేవుడిగా ప్రసిద్ధి చెందారు. కలకడ సమీపంలో వెలసిన శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరుడు సత్యవతినదికి ఉత్తరం వైపున ఉన్న ఈ ఆలయంలో ప్రతి ఏడాది మహాశిరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి పర్వదినానికి మరుసటి రోజున జరిగే ఝరి ఉత్సవానికి చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి వేలాదిమందిగా భక్తులు తరలివస్తారు.

ఝరి ప్రత్యేకం

కలకడ వద్ద కల్లుకుండను దించిన సత్యవతి ఇద్దరు కుమారులకు జన్మనిచ్చింది. తిరిగి వెనకకు చూడగా రాజభటులు వెంట తరుముకుంటూ వస్తుండటంతో వెంటనే భయంతో పరమేశ్వరున్ని ప్రార్థించగా ఆయన ప్రత్యక్షమై కలకడ సత్యవతినది వెంబడి కొంత దూరం వెళ్తితే నది మధ్యలో బండరాయి నిట్టనిలువుగా చీలుతుందని, అందులోకి సత్యవతి–బాహుదా నది సంగమంలోకి ప్రవేశించాలని ఆజ్ఞాపించాడు. దీంతో సత్యవతి స్వామి నేను అక్కడ ఉంటే నీ సాక్షాత్కారం లభిస్తుందా అని కోరగా మహాశివరాత్రి పర్వదినం మరుసటిరోజు కొన్ని గంటలపాటు నేను నీకు దర్శనం ఇస్తాను అదే రోజు నీ వద్దకు వచ్చే భక్తుల కోర్కెలు కూడా తీర్చుతానని అభయం ఇచ్చాడు. నాడు పరమేశ్వరుడు ఇచ్చిన మాటప్రకారం నేటికి ప్రతి ఏడాది మహాశివరాత్రి మరుసటిరోజు ఝరి ఉత్సవానికి మహాశివరాత్రి మరుసటిరోజు సత్యవతి–బాహుదానది సంగమమైన పవిత్ర ఝరిలో లక్ష లాదిగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం చేసుకుంటారు.

కలకడకు ఆపేరు..

సత్యవతి కల్లుకడవతో పార్వతీ పరమేశ్వరుల సాక్షాత్కారం పొందినందున కల్లుగట (కల్లుకడువ)గా పిలువబడి కాలక్రమేణా కల్లుగటను కల్లుగట అనంతరం కలకట, తదనంతరం కలకడగా రూపాంతరం చెందింది. కలకడ సమీపంలో నదిప్రవహించడంతో అప్పటి రాజులు సత్యవతి నదిగా పేరుపెట్టారు.

భక్తులు మెచ్చే అంగళ్లు మల్లయ్య కొండ

కురబలకోట: శివరాత్రి వేడుకలకు అంగళ్లు మల్లయ్య కొండ సిద్ధమైంది. ఈ కొండకు రావడానికి మదనపల్లె వాసులతో పాటు వివిధ ప్రాంతాల వారు ఎంతో మక్కువ చూపుతారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఏ కొండకు లేని విధంగా ఇక్కడ కొండపైకి నేరుగా బస్సులు వెళ్లే సౌకర్యం ఉంది. తారు రోడ్డు వుంది. ప్రతి ఏటా రెండు రోజుల పాటు ఘనంగా వేడుకలు నిర్వహిస్తారు. ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. కొండపై భరత నాట్యం ప్రదర్శన నిర్వహిస్తున్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఎప్పటిలా అన్నదానం నిర్వహిస్తున్నారు.

శివరాత్రి వేడుకలు ప్రారంభం

బి.కొత్తకోట: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవాలయాల్లో మంగళవారం రాత్రి వేడుకలు మొదలయ్యాయి. బీరంగి గ్రామంలోని బండెన్న స్వామి ఆలయంలో పీఠాధిపతి పగడాల లక్ష్మిపతిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అడుగడుగునా శివలింగాలను ప్రతిష్ఠించగా భక్తి శ్రద్ధలతో వాటికి పూజలు నిర్వహించి అత్యంత ఎత్తయిన రెండు శివుడి విగ్రహాలకు విద్యుత్‌దీపాలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయం భక్తులతో కిటకిలాడుతోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.

ఇంటిపట్టాలకు 34 వేల దరఖాస్తులు

– హౌసింగ్ పీడీ సాంబశివయ్య


మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సాంబశివయ్య

పీలేరు : జిల్లాలో కొత్తగా ఇంటి పట్టాల కోసం 34,757 మంది దరఖాస్తు చేసుకున్నట్లు హౌసింగ్ పీడీ సాంబశివయ్య తెలిపారు. మంగళవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో హౌసింగ్ డీఈలు, ఏఈల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గతంలో మంజూరైన లబ్ధిదారులు 11,243 మంది ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టలేదని, అవి రద్దు చేస్తామని తెలిపారు. పీలేరు నియోజకవర్గంలో 9720 మంది ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 7 లేఅవుట్లు సిద్ధం చేయడానికి రూ. 2.84 కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. గ్రామాల్లో 3 సెంట్లు, అర్బన్ ప్రాంతంలో 2 సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్సీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 70 వేలు, బీసీలకు రూ. 50 వేలు మంజూరవుతుందని తెలిపారు. వెలుగులో మరో రూ. లక్ష పొందే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో డీఈ రమణయ్య, ఏఈలు చంద్రశేఖర్‌రెడ్డి, సయ్యద్‌బాషా, నాగముని నాయక్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణే ధ్యేయం

మదనపల్లె /నిమ్మనపల్లె : మదనపల్లె డివిజన్లో టీబీ నివారణ ధ్యేయంగా ఆరోగ్య సిబ్బంది పని చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం మదనపల్లె వాయల్పాడు టీబీ యూనిట్ల పరిధిలో టీబీ ముక్త్ పంచాయతీలుగా ఎంపికైన ఆరోగ్య సిబ్బందితో త్యాగరాజ వీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. మదనపల్లె, నిమ్మనపల్లె మండలంలోని తవళం, కొండయ్య గారిపల్లె గ్రామాల్లో టీబీ రోగులు వాడుతున్న మందులు, ఆరోగ్య పరిస్థితిపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. టి.బి.మందులు తీసుకొంటున్న వారిని క్షేత్రస్థాయిలో కలసి అభిప్రాయం తెలుసుకుని, సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పీహెచ్‌సీ పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రోగుల వివరాలను తెలుసుకోవాలన్నారు. రోగులపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ వైద్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఫరఖాన్, ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు ప్రభాకర్, నాగిరెడ్డి, దేవేంద్ర, భూపతి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణ పూర్వ ప్రాథమిక విద్యకు పునాది

నిమ్మనపల్లె : అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ కోసం అమలు చేస్తున్న జ్ఞాన జ్యోతి కార్యక్రమం పూర్వ ప్రాథమిక విద్య కు పటిష్ట పునాది వేస్తుందని సీడీపీఓ సుజాత అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డివారిపల్లెలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఎంఈఓ ఎం,ఆర్. పద్మావతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఆరు రోజులపాటు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని రెండు విడతలుగా నిర్వహించామన్నారు. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకునేలా అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో అమలు పరచాలన్నారు. 3– 6 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలలో శారీరక, మానసిక, సామాజిక, భాషాభివృద్ధి చెందడానికి, పిల్లలలో సజనాత్మకతను పెంపొందించడానికి శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు . కార్యక్రమంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నరసింహులు, నిర్మల, అంగన్వాడీ సూపర్వైజర్ భానులక్ష్మీదేవి పాల్గొన్నారు.

జీవ వైవిధ్య రక్షణ కోసం ప్రకృతి సేద్యం


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

మదనపల్లె : ఆధునిక జీవనశైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతోంది. సృష్టిలోని జీవరాశులు ప్రతిదీ ఒకదాని మీద ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి. మనిషి సైతం తన ప్రతి అవసరానికి ప్రకృతి మీద ఆధారపడతాడు. ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదు. జీవజాతులు అంతరించిపోకుండా, జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవమే ప్రకృతి వ్యవసాయమని, నేచురల్ ఫార్మింగ్ ఎక్స్‌పర్ట్స్ విజయ్‌రామ్, నరసింహారెడ్డి అన్నారు. ఏపీ మాస్ రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీఎల్ఆర్‌సీ భవనంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రకృతి వ్యవసాయ నిపుణులు విజయ్‌రామ్, నరసింహారెడ్డి మాట్లాడుతూ...మనం నివసిస్తున్న భూమండలంపై రోజురోజుకీ వేడి పెరిగిపోతోందన్నారు. మనం తినే ఆహారంలో పోషకవిలువలు, సూక్ష్మపోషకాలు లేకపోవడంతో.... ప్రస్తుతం మనం ఎంతో ఇష్టంగా తింటున్నది..జీవశక్తి(పునరుత్పత్తిశక్తి)లేని విషతుల్య ఆహారం అన్నారు. అందుకే నేడు గ్రామగ్రామాన సంతానసాఫల్య కేంద్రాలు వెలుస్తున్నాయన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని, నేలను, వాతావరణ సమతుల్యతను కాపాడాలంటే... పాత పద్ధతిలో తాతల నుంచి సంరక్షించుకుంటూ వస్తున్న దేశవాళీ విత్తనాలతో గోఆధారిత వ్యవసాయం చేయడమే శరణ్యమన్నారు. మానవ మనుగడ కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి సేద్యం వైపు మళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సుభాష్ పాలేకర్ వ్యవసాయం(ఎస్‌పీకే) అద్భుత జీవనకళగా పేర్కొంటూ, మంచి ఆహారం తిన్నప్పుడు, ఆలోచనలు, ఆరోగ్యం బాగుంటుందన్నారు. రసాయన ఎరువుల విచ్చలవిడి వాడకంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. ఏపీ మాస్ సీఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ...రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మదనపల్లె, కురబలకోట మండలాల్లోని 14 పంచాయతీల్లో 9,000 మంది రైతులతో, మహిళాసంఘాల సభ్యులతో ప్రకృతి వ్యవసాయం దిశగా కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ మాస్ వాసుదేవరెడ్డి, ఎస్‌పీకే రైతు చందూల్‌కుమార్, రైతుమిత్ర సీఆర్‌పీలు, ప్రకృతి వ్యవసాయరైతులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మహాశివరాత్రి పురస్కరించుకుని శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి పి.రాము తెలిపారు. రెండు రోజుల పాటు ప్రత్యేక సర్వీసులు నడుస్తాయన్నారు. మంగళవారం మదనపల్లె వన్ డిపోలో తనిఖీ నిమిత్తం వచ్చి బస్సుల కండీషన్‌ను పరిశీలించారు. తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు 70 బస్సులు, అంగళ్లు సమీపంలోని మల్లయ్యకొండకు 10 బస్సులు, నిమ్మనపల్లె తవళం వద్దనున్న నేలమల్లేశ్వరస్వామి ఆలయంకు 15 బస్సులు, కలకడ నుంచి ఝరికి 10 బస్సులు, పీలేరు నుంచి తలకోన, రాయచోటి నుంచి పొలతల, గండితో పాటు పలు శైవక్షేత్రాలకు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం కోసం మంచి కండిషన్ ఉన్న బస్సులు నడపాలన్నారు. ప్రతి రోజు బస్సులను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా పరిశీలించాలని మెకానిక్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ–1,2 డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, అమరనాథ్,సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుల నియామకం

తంబళ్లపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మండల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ బి.కొత్తకోట నగర పంచాయతీ అధ్యక్షులుగా సి.చిన్నికృష్ణ, బి.కొత్తకోట మండల అధ్యక్షులుగా ప్రదీప్‌రెడ్డి, కురబలకోట మండల అధ్యక్షులుగా జి.మధుసూదన్‌రెడ్డి, ములకలచెరువు మండల అధ్యక్షులుగా కె.మాధవరెడ్డి, పెద్దముడియం మండల అధ్యక్షులుగా రెడ్డెప్పరెడ్డి, పెద్దతిప్పసముద్రం మండల అధ్యక్షులుగా కె.మల్లికార్జున, తంబళ్లపల్లె మండల అధ్యక్షులుగా ఆర్.చౌడేశ్వరను నియమించారు.

రైతులకు అవగాహన సదస్సు


సూచనలు ఇస్తున్న టెక్స్‌మో ప్రతినిధులు

తంబళ్లపల్లె: వ్యవసాయ మోటార్లు వినియోగించే రైతులకు నష్టాలను తగ్గించేందుకు మోటార్ మెకానిక్ ,ఎలక్ట్రిషయన్లుకు అవగాహన కల్పిస్తున్నట్లు టారో టెక్స్‌మో కంపెనీ మేనేజర్ రాజేష్ తెలిపారు. మంగళవారం ఎస్‌జీఆర్ ఫంక్షన్ హాలులో ప్రకాష్ ఎలక్ట్రికల్ ఆధ్వర్యంలో మోటారు మెకానిక్‌లు, ఎలక్ట్రిషియన్లు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సేల్స్‌మేనేజర్ రాజేష్, సూర్యప్రకాష్‌లు మోటార్ల వినియోగం, స్పేర్‌పార్ట్సు, పంపులు, కంప్రెజర్, స్టాటర్లు ఏర్పాటు అంశాలపై కూలంకశంగా వివరించారు. మెకానిక్‌లు ముందుచూపుతో మోటార్ల ఏర్పాటులో తగు చర్యలు తీసుకున్నప్పుడే మరమ్మతులకు గురికాకుండా రైతులకు నష్టం వాట్లికుండా అధికమించవచ్చునన్నారు.

వైభవంగా సదాశివుడి ఊరేగింపు


సదాశివుని ఊరేగింపు

తంబళ్లపల్లె: మండలంలోని గుండ్లపల్లి గ్రామం ఏటిగడ్డలో వెలసిన సదాశివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామస్థులు శివమాల భక్తులు మంగళవారం స్వామిని చాందినీలో అలంకరించి ఊరూరా మల్లయ్యకొండ కిందకు ఊరేగింపు నిర్వహించారు. పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా పేళ్లుల్లు భక్తులను అలరింపజేశాయి. శివమాల భక్తులు నియనిష్టలతో ఇరుముడు ధరించి మల్లయ్యకొండకు చేరుకున్నారు. స్వామి ఇరుముడులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు శివనామ స్మరణతో మారుమ్మోగింది. పూజారులు ఈశ్వరప్ప,మల్లికార్జునలు స్వామి ప్రత్యేక అలంకరణతో పూజలు,అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈఓ మునిరాజ, కొండకిట్ట భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్.ఐ లోకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ఆలయాన్ని శుద్ధి చేయిస్తున్న అర్చకులు, టీటీడీ అధికారులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కోయిళ్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది స్వామివారి బ్రహ్మోత్సవాలకు వారం రోజులు మునుపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. తిరుమంజనం అంటే ఆలయాన్ని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేయడం, స్వామివారి ఆయుధాలను, ఆభరణాలు, వెండిపాత్రలన్నింటిని పలురకాల ద్రవ్యాలతో శుద్ధి చేయడం అని అర్థం. ఈనేపథ్యంలో మంగళవారం ఆలయంలో వేకువజామునే తోమాలసేవ నిర్వహించారు. స్వామివారికి అర్చన మొదటి గంట నిర్వహించారు. టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది కలసి ముందుగా భక్తిశ్రద్ధలతో సుగంధ ద్రవ్యాలతో కూడిన మిశ్రమ పదార్థాంతో ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలనే స్వామివారి ఆభరణాలు, వెండి పాత్రలను సుగంధ ద్రవ్యాలతో శుభ్రం చేశారు. దీంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కావించే నట్లేనని అర్థం. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ: మదనపల్లెలోని శివాలయాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభించారు. గణపతి ప్రార్థన, స్వస్తివాచన, కలశస్థాపన, నాందీ, ఋత్విగ్వరణం, ఆదిత్యాది నవగ్రహ పూజలు, మండప పూజ నిర్వహించారు. అర్చకులు ఆలూరి ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో సాయంత్రంస్వామి, అమ్మవార్లను నందివాహనంపై ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. స్థానిక చిప్పిలిలోని శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతి పూజ, స్వస్తివాచకం నిర్వహించారు. అర్చకులు విశ్వేశ్వరప్రసాద్, రవి ప్రత్యేక పూజలు చేశారు.

ముస్తాబైన శివాలయాలు: మహాశివరాత్రి పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబయ్యాయి. స్థానిక సీటీఎం రోడులోని మంజునాథస్వామి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, టీఎస్ వెంకటసుబ్బారెడ్డి వీధిలోని పంచలింగాల మల్లికార్జునస్వామి ఆలయం, బసినికొండలోని శివాలయం, సీటీఎంలోని కాశీవిశ్వేశ్వర ఆలయం, గెవిగుండలోని గంధర్వర స్వామి ఆలయం, వేంపల్లిలోని మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి ఆలయాలు శివరాత్రి ఉత్సవాలు ముస్తాబు చేశారు.